ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
కర్నూలు

మాట్లాడుతున్న ఈ.పుల్లారెడ్డి

మహిళా రెజ్లర్ల అరెస్టులను ఖండించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోమంటే మహిళా రేజ్లర్ల అక్రమ అరెస్టులను ఖండించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి కోరారు. సోమవారం కర్నూలు నగరంలోని సుందరయ్య జంక్షన్ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో 30 రోజుల నుండి నిరసన తెలుపుతున్న రెజ్లర్ల క్రీడాకారుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజధాని నడిబొడ్డులో 30 రోజుల నుండి ప్రపంచ వేదికపై భారత కీర్తిని పెంచే రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్య తీసుకోవాలని కోరుతూ నిరసన తెలిపినా నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పార్లమెంటు ప్రారంభోత్సవం సందర్భంగా రెజ్లర్లకు న్యాయం చేయమని కోరుతూ శాంతియుత నిరసన ర్యాలీ చేస్తామంటే వేధింపులకు పాల్పడిన వారిని వదిలేసి లైంగిక వేధింపులకు గురైన వారికి మద్దతుగా నిలిచిన క్రీడాకారులను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. భారతదేశ ఖ్యాతిని

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రపంచవ్యాప్తంగా విస్తరింప చేసిన మహిళ క్రీడాకారులకు న్యాయం చేయలేని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇంకెవరికి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే మహిళా రెజ్లర్ల క్రీడాకారులపై అత్యాచారానికి పాల్పడ్డ బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలన్ని కలిసి క్రీడాకారులకు మద్దతుగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఓల్డ్ సిటీ న్యూ సిటీ అధ్యక్షులు రసీదా, ధనలక్ష్మి డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు, సిఐటియు ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, నరసింహులు, విజయ్ సాయిబాబా, సిఐటియు జిల్లా నాయకులు రాముడు, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్ఎ. సుభాన్, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూముల మార్కెట్

విలువను ఉపసంహరించాలి

- పట్టణ పౌరసంఘం రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట పిపిఎస్ఎస్ ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం జూన్ ఒకటి నుంచి పెంచబోతున్న భూముల మార్కెట్ విలువను ఉపసంహరించుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ధర్నా కార్యక్రమానికి ఎం.నాగరాజు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా క్రెడాయి ఉపాధ్యక్షులు ఎకె.భరత్ రెడ్డి, కెఇ.జగదీష్ కుమార్ మాజీ అధ్యక్షులు గోరంట్ల రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రంలో 11జిల్లా కేంద్రాలు, వాటి చుట్టుపక్క ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల నిర్మాణాలపై మార్కెట్ విలువ పెంచారన్నారు. నెల క్రితం రిజిస్ట్రేషన్ శాఖ వారు 10 రెట్ల యూజర్ చార్జీలు పెంచడం వల్ల ఆస్తులు కొనాలనే సామాన్యుల కల కలగానే మిగిలిపోతుందన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడం వల్ల మున్సిపల్ పట్టణాల్లో ఇంటిపన్ను,చెత్తపన్ను, డ్రైనేజీలాంటి పన్నులు పెరుగుతాయన్నారు. ఇలా మార్కెట్ విలువ పెంచడం వల్ల నగరాభివృద్ధితో పాటు రాష్ట్ర అభివద్ధి కూడా కుంటు పడుతుందన్నారు. కొనుగోల్లు ఆగిపోయినందువల్ల ఈ రంగంపై ఆధారపడ్డ వేలాదిమంది ఉపాధి ప్రశ్నాత్మకంగా మారిందన్నారు. గత ఏడాది నిర్మాణరంగంపై పెంచిన చార్జీలు, గత నెలలో పెంచిన యూజర్ చార్జీలు రద్దుచేసి జూన్ 1నుండి పెంచనున్న భూముల విలువలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో బిల్డర్స్ యజమానుల సంఘం నుండి జి.సత్యనారాయణ రెడ్డి, పిపిఎస్-ఎస్ నగర నాయకులు ఎస్.చాంద్‌బాషా, ఎ.వెంకటేశ్వర్లు, ఎన్ మద్దిలేటి, ఎస్.రమణ గౌడ్, కె.మధుసూదన్, ఎం.సాంబశివారెడ్డి, కె.శ్రీనివాసులులు తొపాటు నిర్మాణ రంగంలో పనిచేసే ఉద్యోగులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు ప్రాధాన్యత

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'జగనన్నకు చెబుదాం'కు సంబంధించి అర్జీలకు ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. వీటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మండలాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... స్పందన అర్జీలకు సంబంధించి ఇంకా చూడని ఫిర్యాదులు ఉండకుండా చూడాలని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'కు సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలను అధికారులంతా ఈరోజు పరిశీలించి సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటన కొన్ని అనివార్య కారణాల వల్ల జూన్ 1కి వాయిదా పడిందన్నారు. ఈ సమయాన్ని అధికారులందరూ సద్వినియోగం చేసుకొని రేపు సాయంత్రం నాటికి పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐసిడిఎస్ సిబ్బంది సభా ప్రాంగణ సుందరీకరణ, ఆర్అండ్‌బి శాఖ రోడ్లు, ఆర్చీలు, హెలిప్యాడ్ వద్ద పార్కింగ్, సభా ప్రాంగణం వద్ద బ్యారికేడింగ్, డిపిఓ పారిశుధ్యం, పిఓ ఎస్ఎస్ఎ సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు వారికి కేటాయించిన విధులలో ఎటువంటి అలసత్వం లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... సరిహద్దు రాళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్స్ ఏర్పాటు చేయడానికి గాను రెండు వేల చదరపు అడుగుల స్థల సేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. అందుకు గాను పెండింగ్ ఉన్న మండలాల తహశీల్దార్లు త్వరితగతిన స్థలాలు గుర్తించి బిఎస్ఎన్ఎల్ అధికారులకు సంబంధిత స్థలాన్ని అందజేసి అందుకు తగిన నకలు కాపీని కలెక్టర్ కార్యాలయానికి పంపాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

- ఆవాజ్ జిల్లా కార్యదర్శి సుభాన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ముస్లిం, మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్ఎ.సుభాన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా నాయకులు మాబాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్ఎ.సుభాన్, నగర కార్యదర్శి ముహమ్మద్ షరీఫ్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మైనార్టీల సంక్షేమ పథకాలను, ఒక్కొక్కటి రద్దు చేస్తూ వస్తూ ఉందన్నారు. దుకాణ్ మకాన్, రోషిని, రివాలింగ్ ఫండ్, ఇలాంటి సంక్షేమ పథకాల రద్దు చేశారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల్లో ఎక్కువ సంఖ్యలో ఈ నగరంలో ముస్లిం, మైనార్టీలు ఉన్నారని తెలిపారు. వారికి ఎటువంటి సంక్షేమ పథకాలూ రాకుండా మెమో నెంబర్ 1214 తీసుకొని వచ్చారని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇచ్చేదే లేదని దుర్మార్గపు ఆలోచన సరైంది కాదన్నారు. దుల్హన్ పథకానికి పదో తరగతి చదవాలనే కిటుకును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిజంగా మైనార్టీల పట్ల చిత్తశుద్ధి ఉంటే షాది ముబారక్ ఇవ్వాలనుకుంటే ఎలాంటి షరతులూ లేకుండా, నేరుగా రూ.లక్ష ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏదైతే ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని, ఇది మైనార్టీల పట్ల వైసిపికి ఉన్న చిత్తశుద్ధి అని వ్యాఖ్యానించారు. రాబోవు ఎన్నికల్లోపు వైసిపి ప్రభుత్వం మైనారిటీల పట్ల తమ విధానం మార్చుకోకపోతే రాజకీయంగా సమాధి కడతామని హెచ్చరించారు. గతంలో టిడిపికి పట్టిన గతే వైసిపి కూడా పడుతుందని తెలిపారు. తక్షణమే ముస్లిం మైనార్టీల సంక్షేమ పథకాలు కొనసాగించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ భూములు అన్యాయక్రాంతం నుంచి స్వాధీనం చేసుకొని, ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం తోడ్పాటనందించాలని కోరారు. ముస్లింలకు డైరెక్టర్ లోన్లు, ఉపాధి కల్పన కోసం, దళితులపైనా, మైనార్టీలపైనా జరుగుతున్న దాడులను ఏనాడూ వైసిపి ప్రభుత్వం ఖండించలేదన్నారు. దానికి తోడుగా, బిజెపికి అనుసంధానంగా ఉంటుందే తప్ప ఏనాడూ కూడా వ్యతిరేకంగా, మైనార్టీలకు అనుకూలంగా, వ్యవహరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్ బాషా, షేక్ అబ్దుల్ నయీమ్, చోటు భాయ్, నూర్ వలీ, హనీఫ్, సలీం పాషా, ఫయాజ్ ఖాద్రి, ఇర్ఫాన్, మాలిక్, అన్వర్ బాష, అహ్మద్, మూసా మియా, శాలి, బాబు, బాబు, అన్వర్ ఇస్మాయిల్, ఖాదర్ బాషార, కాలు, అజీజ్ భాయ్ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ఆవాజ్ నాయకులు

రెజ్లర్లకు మద్దుతుగా క్రీడాకారుల బ్లాక్ డే

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ఢిల్లీలో పోరాడుతున్న మహిళా రెజ్లర్లు ఇచ్చిన మహాపంచాయతీ పిలుపునకు మద్దతుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వైపు కవాతు చేస్తున్న అనేక మంది కార్యకర్తలను , సామాజిక ఉద్యమ ప్రముఖ నాయకులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఎఐడిఎస్ఓ, ఎఐఎంఎస్ఎస్, ఎఐకెఎంఎస్ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలోని క్రీడాకారులతో 'బ్లాక్ డే' నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఐడిఎస్ఓ, రాష్ట్ర అధ్యక్షులు వి.హరీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఒకవైపు ప్రధానమంత్రి కొత్త పార్లమెంట్ భవనాన్ని "ప్రజాస్వామ్య దేవాలయం"గా ప్రారంభిస్తుంటే, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ వద్ద ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా జంతర్ మంతర్ వద్ద మహిళా మహాపంచాయత్ సమావేశానికి పెద్ద ఎత్తున కదిలిన భారీ నిరసనలో పలువురు సామాజిక కార్యకర్తలు, ముఖ్య నేతలు పాల్గొన్నారని తెలిపారు. మహాపంచాయత్‌ను నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతో ఢిల్లీ ప్రభుత్వం చాలా మంది నిరసనకారులను అరెస్టు చేసిందన్నారు. కొందరిని గృహనిర్బంధంలో ఉంచిందని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడకుండా చేసిందని, మా సోదర సంఘాలైన ఎఐఎంఎస్ఎస్, (అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం), ఎఐకెఎంఎస్(ఆల్ ఇండియా కిసాన్ ఖేత్ మజ్దూర్ సంఘటన్) ఎఐడిఎస్ఓ, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారని తెలిపారు. ఎఐఎంఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడి, పోక్సో చట్టం కింద దోషిగా తేలిన బిజెపి ఎంపిని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండటం నిజంగా దిగ్భ్రాంతికరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో ఎఐడిఎస్ఓ నగర కార్యదర్శి హెచ్.మల్లేష్, శక్రప్ప, బసవరాజు, ఖాదర్, రజిత, రమేష్, కల్యాణ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారానికి వ్యకాసం వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు - గుంటూరు రహదారిలో కర్నూలు నుండి గార్గేయపురం వరకు రోడ్ల విస్తరణ పనుల్లో స్థలాలను కోల్పోయిన పేదలకు న్యాయమైన పరిహారం చెల్లించాకే పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ అన్నారు. సోమవారం కర్నూలు ఆర్‌డిఓ కార్యాలయంలో ఎఓ వేణుగోపాల్‌కు కెవి నారాయణ, మండల నాయకులు పిబి హుస్సేనయ్య, బాధితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. నారాయణ మాట్లాడుతూ... రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గార్గేయపురం, నందనపల్లి, మిలిటరీ కాలనీ, భూపాల్ నగర్, వెంకాయపల్లి గ్రామాలలో పేదలు నిర్మించుకున్న ఇళ్లు కూల్చాలని అర్అండ్ బి అధికారులు మార్కింగ్ వేసి వెళ్ళారన్నారు. న్యాయమైన పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని అన్నారు. రోడ్లు విస్తరణ పేరుతో ముందస్తు హెచ్చరికలు లేకుండా పేదల ఇళు కూల్చడం సరికాదన్నారు. గ్రామసభ వేసి మార్కెట్ విలువ ప్రకారం స్థలానికి ఇంటికి విలువ కట్టి పరిహారం ఇవ్వాలని, ఆ తర్వాతే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామవాసులు రామకృష్ణ, ఆంజనేయులు, అయ్యస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నారాయణ, తదితరులు

చంద్రబాబు వైఖరికి నిరసనగా వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ :

మొదటి నుంచి పేదలపై చంద్రబాబుది దుర్మార్గ వైఖరి అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై. రామయ్య మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను సమాధులతో పోల్చిన టిడిపి అధినేత చంద్రబాబు వైఖరికి నిరసనగా సోమవారం కర్నూలు నగరంలో ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పెద్ద మార్కెట్, గడియారం హాస్పిటల్, పూలబజార్, ఉస్మానియా కాలేజ్, వడ్డేగిరి, రాజ్ విహార్, 5 రోడ్ల కూడలి, ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నవరత్నాల్లో ఒకటైన 'పేదలందరికీ ఇళ్ళు' పథకంలో 25 లక్షల ఇళ్ళు నిర్మిస్తే టిడిపి భూస్థాపితం అవుతుందని చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. అందుకే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇచ్చే స్థలాలపై చంద్రబాబు తన పార్టీ నేతలతో అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పెత్తందార్లకు ప్రెసిడెంట్ అని అన్నారు. ఇకనైనా బాబు తన బుద్ధి మార్చుకోకపోతే టిడిపి భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. బి.వై. రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా పేదలకు స్థలాలు ఇచ్చిన చంద్రబాబుకు కడుపుమంటే అన్నారు. ఎక్కడైనా పేదలకు స్థలాల ఇచ్చేందుకు భూమి పరిశీలించినా ఆఘమేఘాల మీద చంద్రబాబు తన పార్టీ నేతలతో కోర్టులో కేసులు వేయించి అడ్డుపడ్డపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య మాట్లాడుతూ... దళితులను పేదలను అవమానకరంగా మాట్లాడిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెబుతారని అన్నారు.

వైసిపి బైక్ ర్యాలీలో కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్ , మేయర్ బివై.రామయ్య

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోరంట్లప్ప డిమాండ్ చేశారు. జర్నలిస్టుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని కర్నూలు డిపిఆర్ఓ కార్యాలయం ముందు నగర అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. టి.మద్దిలేటి , బి. గోరంట్లప్ప, నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సీనియర్ నాయకులు సత్యనారాయణ గుప్తా, పానుగంటి చంద్రయ్య, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ఎంయు.వినయ్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ లు మాట్లాడారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు ఇవ్వడానికి కూడా జిఓల పేరుతో కాలయాపన చేయడం రాష్ట్ర ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పెట్టినన్ని ఆంక్షలు ఎప్పుడూ లేవని అన్నారు. చిన్న పత్రికలపై పలు రకాల షరతులు విధించి ఉనికి లేకుండా చేస్తున్నారన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డును ఇవ్వడంలో ఎందుకు ఇంత కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలు పరిస్కారం చూపెదాక ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ప్రతి మండల జర్నలిస్టుకు అక్రిడేషన్ ఇవ్వాలని, చిన్న పత్రికలకు పాత విధానంలోనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టుల పై దాడుల నివారణకు హైపవర్ కమిటీని నియమించాలని, జర్నలిస్టులకు గృహావసతి, పెన్షన్ సదుపాయం కల్పించాలని, కార్మిక బీమా ,ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేసి ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన కు డిమాండ్లతో కూడిన వినతిని అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ డిమాండ్లను ప్రభుత్వదృష్టికి తీసుకెళ్తానని, అందరికి న్యాయం జరిగేలా చూస్తామని, 30న అక్రిడేషన్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ సత్యన్న, ,ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉపాధ్యక్షులు రమేష్, సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు బ్రహ్మయ్య, రఫీ, చెన్నయ్య, మధు, శ్రీనాథ్‌రెడ్డి, నాగరాజు,మౌలాలి పాల్గొన్నారు.

కల్లూరు తహశీల్దార్‌కు వినతి

కర్నూలు హాస్పిటల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నిర్వహిస్తున్న "డిమాండ్స్ డే"లో భాగంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎపిడబ్ల్యుజెఎఫ్ కల్లూరు మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిజి వెంకటేశ్వర్లు, ఎం.పరమేష్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వినయ్ కుమార్, పాణ్యం నియోజకవర్గం కమిటీ కార్యదర్శి నీలం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వి.విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. డిమాండ్లతో కూడిన వినతిని కల్లూరు తహశీల్దార్‌కు అందజేశారు. మండల కమిటీ సభ్యులు జనార్దన్, ఆనంద్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, వెంకటేష్, సుంకన్న, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి బృందం, కల్లూరు తహశీల్దార్‌కు వినతిని ఇస్తున్న వినయ్, సత్యనారాయణ

మహిళలకు టిడిపి వరాల జల్లు

చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం
టిడిపి జిల్లా అధ్యక్షులు పోలిశెట్టి వెంకటేశ్వర్లు, టిజిభరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాజమండ్రి వేధికగా తెలుగుదేశంపార్టీ నిర్వహించిన మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు మహిళలకు వరాలు జల్లు కురిపించారని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిజి.భరత్ అన్నారు. టిడిపి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిజి.భరత్, మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, ప్రధాన కార్యదర్శి సుకన్య, బిసిసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంజీవలక్ష్మీ హాజరయ్యారు.వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో మహిళలను మోసగించి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నాలేగేళ్లలో మహిళలకంటూ ప్రత్యేకంగా ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. కేవలం ఎన్నికల్లో మహిళలను ఓటుబ్యాంకుగా వాడుకున్నారు తప్ప మరొకటి కాదనీ తెలిపారు. రానున్న 2024 ఎన్నికలలో పార్టీ అనుసరించబోయే విధానాలను ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చారని అన్నారు. మహాశక్తి పేరుతో మహిళలకు కొన్ని వరాలు ప్రకటించారని తెలిపారు. టివి రాజ్యలక్ష్మి, కార్పోరేటర్లు రమణమ్మ, ఎస్.జకీయా అన్సారి, జె చంద్రకళాబాయ్, జి.విజయలక్ష్మి, ఎ.మారుతీశర్మ, ఆశాలత, ఎం.శాంతమ్మ, డి.అనిత, కె.మున్నీ, ఎస్.క్రిష్ణవేణి, కె,సుశీల, రేనుకా, లలిత, సుజాత, ఆర్ కాంతమ్మ, వరలక్ష్మి, ఎలిసా పాల్గొన్నారు.

సెయింట్ లూర్డ్స్ విద్యార్థికి మొదటి ర్యాంక్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (నీట్, ఐఐటి ఇంటిగ్రేటెడ్ ఇంటర్మీడియట్ కోర్సులలో) 2023-24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ ఫలితాలలో కర్నూలు సెయింట్ లూడ్స్ పాఠశాలకు చెందిన వేల్పుల జాన్ అబ్రహం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ వేల్పుల సుదర్శన్, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

అడిషనల్ ఎస్‌పిగా సర్కార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్:

కర్నూలు జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా టి సర్కార్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఎస్‌పి జి.కృష్ణకాంత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మాట్లాడుతున్న రామాంజనేయులు

నియంతృత్వ, రాచరికం వైపు నడుస్తున్న మోడీ విధానాలను తిప్పికొట్టండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియంతృత్వ, రాచరికం వైపు నడుస్తున్న మోడీ విధానాలను తిప్పి కొట్టాలని, రాజ్యాంగ విలువలను రక్షించుకుంటూనే ప్రజా సమస్యలపై పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు కోరారు. సోమవారం పశ్చిమ ప్రాంత జిల్లాస్థాయి సిపిఎం శిక్షణ తరగతులు పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు క్లాసులను రామాంజనేయులు మాట్లాడి ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో రామాంజనేయులు, జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, టి.నరసింహ, లింగన్న, లక్ష్మన్న, వీరశేఖర్, హనుమంతు మాట్లాడారు. దేశంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం నియంతృత్వంగా రాచరికం వైపు నడిపిస్తోందని విమర్శించారు. ఎందరో త్యాగధనులు పోరాడి సాధించిన భారత స్వాతంత్ర ఫలాలను ప్రజలందరికీ అందేలాగా, రాజ్యాంగ విలువలను రక్షించుకుంటూనే, ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాల కారణంగా రోజువారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పనిచేయాలని కోరారు. అనంతరం 'నయా ఉదారవాద విధానాలు- ప్రజలపై వాటి ప్రభావం' అనే క్లాసును టి.నరసింహ, మతం-మతతత్వం అనే క్లాసును కెవి.నారాయణ బోధించారు. సిపిఎం ఆలూరు నాయకులు నారాయణస్వామి, మంత్రాలయం నాయకులు జయరాజు, కౌతాళం నాయకులు మల్లయ్య, పెద్దకడబూరు నాయకులు తిక్కన్న, కోసిగి నాయకులు రాముడు, తుగ్గలి నాయకులు శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి

- అభివృద్ధి పనులకు భూమి పూజ - మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం దేవాలయంలో రూ.1.28 కోట్లతో నూతనంగా గ్రానైట్‌తో బండ పరుపు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వారి భక్తులకు సేవలు, సౌకర్యాలు అందించడానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూడాల్సిన బాధ్యత పాలకమండలిపై ఉందన్నారు. దేవాలయం అధికారులు, పాలక మండలి సభ్యులు భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. దేవాలయంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు దేవాలయం సహాయ కమిషనర్ వాణి, ఆలయ కమిటీ ఛైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ముఖ్య అర్చకులు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

బైక్ ర్యాలీ : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మండల నాయకుల ఆధ్వర్యంలో మండల సరిహద్దు గ్రామమైన జుమ్మాలదిన్నె నుంచి భారీగా బైక్ ర్యాలీ ద్వారా స్వాగతం పలికారు. వైసిపి మండల నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, ఏకం రెడ్డి, ఎంపిపి అమ్రేష్, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ మెంబర్ మాబు సాబ్, చెన్నప్ప, బసవ ప్రభు, పాల్ దినకరన్, చౌదరి బసవరాజ్, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

'ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి'

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలో ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. హొళగుందలో అనేక మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మధ్యతరగతి కుటుంబంలో ఉన్న పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. విద్యార్థి సంఘం నాయకులు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి అయినా ఎస్సీ హాస్టల్‌ను ప్రారంభించి పేద విద్యార్థులందరికీ విద్యనందించే విధంగా చూడాలని కోరారు. లేకపోతే విద్యా సంవత్సరం మొదటి రోజు నుంచి ఎస్సీ హాస్టల్‌ను తిరిగి ప్రారంభించే వరకు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

కడుపులో బిడ్డకు... బయట తల్లికి కష్టం...

- స్కానింగ్ కోసం గర్భిణుల ఇబ్బందులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కడుపులో బిడ్డ కాళ్లతో తంతుంటే ఆనందపడాల్సిన తల్లి ఆవేదన చెందుతోంది. 'అమ్మా' అని పిలిపించుకోవడానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్న తల్లికి 'లేవు.. ఇప్పుడు కాదు.. తర్వాత రండి' అనే మాటలు ఇబ్బంది పెడుతున్నాయి. ఆదోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో సోమవారం స్కానింగ్ పరీక్షలకు వచ్చిన గర్భిణులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చే గర్భిణుల ఆవేదన మాటలకందనిది. కడుపులో బిడ్డ ఎలా ఉన్నాడని తెలుసుకోవడానికి, చికిత్స అందించడానికి ముఖ్యమైంది స్కానింగ్. బిడ్డ లోపల ఎలా ఉన్నాడో అని తెలుసుకోవడానికి చేసే స్కానింగ్ కోసం రోజుల తరబడి ఆస్పత్రి ఎదుట ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

మూలనపడిన స్కానింగ్ పరికరాలు

ఆదోని ఆస్పత్రిలో మూడు స్కానింగ్ యంత్రాలు ఉన్నాయి. వీటిలో రెండు విద్యుత్ హెచ్చుతగ్గులతో కాలిపోయాయి. ఉన్న ఒక్క యంత్రంతోనే అందరికీ సేవలందించాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం గర్భిణులు నిరీక్షించాల్సి వచ్చింది. ప్రతినెలా ఇదే పరిస్థితి ఉన్నా వైద్యాధికారులు స్పందించడం లేదు. నాబార్డు ఆర్థిక సహాయంతో రూ.7, 8 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం పనులు పూర్తికాలేదు. పాతభవనంలో అసౌకర్యాల నడుమ కాలం గడపక తప్పడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలూ సరిగా లేకపోవడంతో గర్భిణుల బాధ వర్ణనాతీతం. ఇక్కడి ప్రభుత్వాస్పత్రిలో రోగుల కోసం కొన్ని సౌకర్యాలను అమర్చినప్పటికీ ముఖ్యమైన స్కానింగ్ విభాగంలో మాత్రం ఎటువంటి అభివృద్ధి జరగలేదు. మూలనపడిన స్కానింగ్ పరికరాలు, పని చేయనవే కనపడుతుంటాయి.

స్కానింగ్ కోసం వేచి ఉన్న గర్భిణులు

మూడేళ్లయినా ఎలాంటి మార్పూ లేదు

తన మొదటి బిడ్డకు కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చానని, తర్వాత రెండోకాన్పు కోసం ఇప్పుడు మళ్లీ వచ్చానని, అప్పటికీ ఇప్పటికీ ఎలాంటి మార్పూ లేదని, స్కానింగ్ కేంద్రం వద్ద గర్భిణులు ఇప్పటికీ గంటల తరబడి ఎదురుచూస్తున్నారని పట్టణానికి చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సామర్థ్యానికి తగిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు, పాలకులు విఫలం చెందారని, గతంలోనే గర్భిణులకు ప్రత్యేకంగా ఒక స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆస్పత్రిలో ఉక్కపోత

- ఈశ్వరి, గర్భిణీ, ఆదోని

స్కానింగ్ పరీక్షల కోసం ఆదోని ప్రభుత్వాస్పత్రికి వచ్చాం. ఇక్కడ గాలి, వెలుతురు లేక అవస్థలు పడ్డాం. కుర్చీలు సరిపోవడం లేదు. కింద కూర్చోవాలంటే ఇబ్బందిగా ఉంది. తాగునీటి సౌకర్యం దూరంగా ఉంచారు. అక్కడికి వెళ్లి తాగాలంటే ఇక్కడ వరుస పోతుందని భయంతో వెళ్లలేదు. ప్రతి నెలా ఇదే పరిస్థితి. అధికారులు మౌలిక వసతులు కల్పించాలి.

బాబును కలిసిన ఆదోని తెలుగు యువత నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాజ మండ్రిలో జరిగిన మహానాడు మహాసభలో చంద్ర బాబు నాయుడును కలిశామని టిడిపి ఆదోని తెలుగు యువత నాయకులు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి సోమవారం తెలిపారు. రాష్ట్రంలో ఏ సమయంలోనైనా ఎన్నికలు రావచ్చని, టిడిపిని గెలుపు దిశగా కృషి చేయాలని అధినేత సూచించారని వారు తెలిపారు. యువత కోసం ప్రకటించిన వరాలు భవిష్యత్తుకు గ్యారెంటీ అనే మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారని చెప్పారు. యుగళం పాదయాత్రను ఆదోనిలో భారీఎత్తున విజయవంతం చేసినందుకు ఆదోని ప్రజలకు ధన్యవాదాలు తెలిపారని వివరించారు.

డ్రైయినేజీపై కట్టడాలు వద్దు...

అభివృద్ధికి ప్రజలూ సహకరించాలి
- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పిలుపు..

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల కోసమేనని, వాటికి ప్రజలు కూడా సహకారం అందించాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కోరారు. ముఖ్యంగా మురుగు నీటి కాలువలను నిర్మిస్తే వాటిని వెంటనే ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. దీనివల్ల మురుగునీరు ప్రవాహానికి కూడా మార్గం లేకుండా పోతోందని అసహనం వ్యక్తం చేశారు. మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

సోమవారం పట్టణంలోని కౌడల్‌పేట ప్రాంతంలో ఉన్న షేర్‌ఖాన్ కొట్టాల ప్రాంతంలో రూ.38 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడ చూసినా మురుగు నీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, దీనివల్ల వర్షపు నీరు ప్రవహించక కాలనీలోకి వస్తున్నాయని చెప్పారు. కాలనీలో వరద నీటిముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. మురుగు నీటి కాలువలు నిర్మించిన తర్వాత వాటిపై ఎలాంటి ఆక్రమణలూ ఉండరాదని, మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘునాథ్ రెడ్డిని ఆదేశించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ప్రస్తుతం రూ.38 కోట్లతో మురుగునీటి కాలువలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇంకా నిధులు అవసరమైతే 15వ ఆర్థిక సంఘం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్లు ఎంఎంజి.గౌస్, నరసింహులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం, షేర్ ఖాన్ రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పార్టీలో పని చేసే వారికే పట్టం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు
- నమ్మకాన్ని వమ్ము చేయను
- మార్కెట్ యార్డు ఛైర్మన్ నారాయణ
- అట్టహాసంగా ప్రమాణ స్వీకార మహోత్సవం

ప్రజాశక్తి-ఆలూరు

వైసిపి అభివృద్ధి కోసం కష్టపడే ప్రతి కార్యకర్తనూ గుర్తించి పార్టీ పట్టం కడుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. సోమవారం ఇబ్రహీం ఫంక్షన్ హాలులో ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా సాగింది. మార్కెట్ యార్డు కార్యదర్శి శాంతి కుమార్ అధ్యక్షత వహించారు. అంతకుముందు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, సభ్యులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మంత్రి స్వగృహం నుంచి మంత్రి జయరాం, సోదరులు శ్రీనివాసులు, నారాయణ స్వామితో కలిసి పెద్దఎత్తున ఓపెన్ కార్ కాన్వాయిలో డప్పుల మోతతో ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. చిప్పగిరి మండలం బెల్డోన సర్పంచి సావిత్రి భర్త గోవిందు, సోదరుడు గోపాల్‌కు మంత్రి గుమ్మనూరు జయరాం వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో జగనన్న పథకాలను కాపీ కొట్టారన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి మాట్లాడుతూ... చిప్పగిరి మండలంలో కన్వీనర్‌గా ఉన్న నారాయణ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిగా ఏకగ్రీవం చేసిన ఘనత సోదరుడు నారాయణకే దక్కుతుందని చెప్పారు. పార్టీ గుర్తించి మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా పట్టం కట్టిందన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో పార్టీ, గుమ్మనూరు సోదరుల నమ్మకాన్ని వమ్ము చేయబోమని తెలిపారు. పార్టీ కోసం తమ అన్నలు, గుమ్మనూరు సోదరుల కోసం ఏమైనా చేయటానికి వెనకాడబోమని చెప్పారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ చిన్న ఈరన్న, ఏరూరు చంద్రశేఖర్, దొరబాబు, కిట్టు, లింగప్ప, ఎంపిపిలు రంగమ్మ, ఈషా, మాదేవి, సొసైటీ ఛైర్మన్లు హనుమంతమ్మ, శీనప్ప, గోవర్ధన్, నిరంజన్ ప్రసాద్, మండల కన్వీనర్లు వీరేష్, పెద్దయ్య, భీమప్ప చౌదరి, షఫీవుల్లా పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి గుమ్మనూరు

గుమ్మనూరు సోదరులను సన్మానిస్తున్న నాయకులు

సన్మానం చేస్తున్న నాయకులు లక్ష్మి కాంత్ రెడ్డి

గ్రామ వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామ సచివాలయంలో సేవా మిత్ర పురస్కారాన్ని సోమవారం వైసిపి మండల సీనియర్ నాయకులు కెఆర్.లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచి మద్దీశ్వరిలు గుమ్మల పుష్ప రాణికి అందజేశారు. నిస్వార్థంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వాలంటీరుగా అందించిన సహకారం మరువలేనిదని, వెల కట్టలేని మీ సేవకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గౌరవ పురస్కారం ఇదేనని, ప్రజలకు సేవ చేసి మరింత కృషి చేయాలని కోరారు. వైసిపి నాయకులు పేట శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాహెబ్, వెంకటరాముడు, తిక్కన్న పాల్గొన్నారు.

'రుతుక్రమం'పై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

మహిళలకు రుతుక్రమం సహజ ప్రక్రియ అని, అపోహలు వీడాలని మెప్మా సిఎంఎం సమీనా పేర్కొన్నారు. ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎంఎం సమీనా, వార్డు హెల్త్ సెక్రటరీ రమాదేవి మాట్లాడారు. మహిళల బహిష్టు సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ప్రతినెలా బహిష్టు కావడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. రక్తహీనత సమస్య రాకుండా పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. బహిష్టు వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కొందరు అపోహలు పడుతున్నారని, ఎలాంటి ఇబ్బందులూ ఉండవని తెలిపారు. సిఒలు అనిత, కృష్ణవేణి, ఆర్‌పిలు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక ఆసరా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హత లేని జబ్బులకు సొంత డబ్బుతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే సహాయం ఒక ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో యువనేత ప్రదీప్ రెడ్డితో కలిసి తెలుగు అంజినయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. మండల కేంద్రానికి చెందిన అంజినయ్య కాలు నొప్పితో బాధపడుతూ ఇటీవల ఎమ్మిగనూరు పట్టణంలో గల సాయిరామ్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో పాటు రాంపురం రెడ్డి సోదరుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి సిఫారసు ద్వారా సిఎం సహాయ నిధి నుంచి రూ.70 వేల చెక్కు మంజూరయినట్లు సర్పంచి భీమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి శాలువా, పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు ఎస్‌కె.షబ్బీర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో జర్నలిస్టు డిమాండ్స్ డే సందర్భంగా తహశీల్దార్ జయన్నకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల పేరుతో జర్నలిస్టులకు ఇచ్చే గుర్తింపు కార్డులను కుదించడం అన్యాయమన్నారు. ఎలాంటి నిబంధనలూ లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేసే జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల యూనియన్లకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు యు.చంద్ర శేఖర్, కార్యదర్శి దేవిశంకర్, ట్రెజరర్ ఎంఎస్.బేగ్, లీగల్ అడ్వయిజర్ బి.శ్రీనివాసులు, ఇలియాస్, సురేంద్ర, ఇబ్రహీం, మురళీ, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఘనంగా వాధీంద్ర తీర్థుల ఆరాధన

- స్వర్ణ శోభితమైన వాధీంద్ర తీర్థుల బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతులు శ్రీవాధీంద్ర తీర్థుల ఆరాధనను పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీగురు రాఘవేంద్ర స్వాముల వారి ముని మనుమలు శ్రీవాధీంద్ర తీర్థుల ఆరాధన సందర్భంగా ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆయన బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. ఆయన చిత్రపటాన్ని స్వర్ణ రథోత్సవంపై ఉంచి పీఠాధిపతులు పుష్పాభిషేకంతో మంగళ హారతులు ఇచ్చి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. శ్రీమఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, ఎస్‌కె.శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

తేలుకాటుతో కోలుకోక బాలుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆవేదన

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు భరత్ కుమార్ మృత్యువాత పడ్డాడని తల్లిదండ్రులు సరస్వతి, నల్లగుట్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తేలుకాటుకు గురై చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరిన ఆస్పరి మండలం అలిగేర గ్రామానికి చెందిన భరత్ కుమార్ కోలుకోక సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడారు. ఆదివారం పొలంలో తేలుకాటుకు గురైన భరత్ కుమార్‌ను హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చామన్నారు. విధుల్లో ఉన్న నర్సు, వైద్యులు పట్టించుకోలేదన్నారు. కళ్లెదుటే గిలగిలా కొట్టుకుంటున్నాడని, ఏదైనా చికిత్స చేయాలని కాళ్లావేళ్లా పడినా తమ పట్లనే దురుసుగా ప్రవర్తించారని వైద్యుల తీరుపై మండిపడ్డారు.

రోధిస్తున్న బాలుని బంధువులు

బాలుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బంధువులను పరామర్శించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఆస్పత్రి సందర్శించి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తున్నా నిర్లక్ష్యం చేయడమేమిటని వారు వైద్యులపై మండిపడ్డారు. తమ కుమారుడు చనిపోయిన అనంతరం ఆక్సిజన్ పెట్టారని, తమకు అన్యాయం జరిగిందని మృతి చెందిన బాలుడు బంధువులు వారి ముందు కన్నీరు మున్నీరయ్యారు. రాత్రి వేళలో పరీక్షించాల్సింది పోయి కర్నూలు వెళ్లాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ కనీసం సెలైన్ బాటిల్ కూడా ఎక్కించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తేలుకాటు విషం మత్తులో ఉండగానే ఇడ్లీ తినిపించాలని చెప్పారని తెలిపారు. ఆస్పత్రిలో కోలుకోక మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరిగిందని, డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సంబంధిత డాక్టర్‌పై చర్య తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న చెప్పారు. వైద్యుల తీరు మారకపోవడంతో వారిపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

పేదలను మోసం చేసే మేనిఫెస్టో

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పేదలను మోసం చేసేందుకే అని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అధ్యక్షతన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయం నుంచి వైఎస్‌ఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్‌టిఆర్ బతికుండగా వెన్నుపోటు పొడిచి టిడిపి పగ్గాలను అక్రమంగా లాక్కొని చంద్రబాబు దొడ్డి దారిన ముఖ్యమంత్రి పదవిని చేజిక్కించుకున్నారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని 700 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి, ఏ ఒక్క హామీ నెరవేర్చలేక మేనిఫెస్టో కాపీని టిడిపి వెబ్ సైట్‌లోనూ తొలగించారని తెలిపారు. రాజమండ్రిలో టిడిపి నిర్వహించిన మహానాడులో కూడా ఆరు హామీలతో మేనిఫెస్టో విడుదల చేశారని, ఆరింటిలో నాలుగు ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. మిగతా రెండు పక్క రాష్ట్రం కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టో నుంచి కాపీ కొట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండి చంద్రబాబు కుయుక్తులకు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. వైసిపి యువనేత జయమనోజ్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దేవదాసు, వైస్ ఛైర్మన్ నరసింహులు, వైసిపి జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ, ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, ఫయాజ్ అహ్మద్, రాజేశ్వరరెడ్డి, బాలాజీ, చలపతి, చిన్న, మల్లికార్జున, మధుబాబు, రెహమాన్, మాధవ రెడ్డి, కిట్టు పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

జగనన్న ఇంటి స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చడం సిగ్గుచేటు

- ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకం ద్వారా పేదలందరికీ ఇల్లు పథకం కింద అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వడం చూసి, ఓర్వలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వాటిని శ్మశాన వాటికతో పోల్చడం సిగ్గుచేటని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. సోమవారం వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని కోసిగి నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం వరకు దాదాపు 800 బైక్‌లతో కోసిగిలోని రంగప్ప గట్టు నుంచి వైఎస్‌ఆర్ సర్కిల్ మీదుగా ఉరుకుంద వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరయి ఆయనే స్వయంగా కోసిగి నుంచి ఉరుకుంద వరకు బైక్ నడుపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అనంతరం స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇంటి పట్టాల గురించి పిచ్చి రాతలతో పచ్చ మీడియా ప్రచురణతో ప్రజలను మభ్య పెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పార్టీలకు పుట్టగతులు ఉండవని తెలిపారు. మళ్లీ 2024లో జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

కోసిగి : బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఎమ్మిగనూరు : అమరావతిలో పేదలకు పట్టాల పంపిణీని అడ్డుకోవడం సిగ్గుచేటని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. సోమవారం టిడిపి దుర్మార్గాన్ని నిరసిస్తూ స్థానిక వైసిపి కార్యాలయం నుంచి షరాఫ్ బజార్, శ్రీనివాస్ టాకీస్, వైఎస్‌ఆర్ సర్కిల్, అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు అమరావతిలో ఇచ్చిన భూములను శ్మశానాలతో పోల్చడం చంద్రబాబుకు సబబు కాదన్నారు. రాబోయే కాలంలో చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

ఎమ్మిగనూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంత్రి నమ్మకాన్ని వమ్ము చేయను

- వైసిపి కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏరూరు రంగస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

కన్వీనర్‌గా రంగస్వామిని ప్రకటిస్తున్న మంత్రి జయరాం

చిప్పగిరి మండలంలో ప్రతి గ్రామంలో కూడా వైసిపి అభివృద్ధికి కృషి చేస్తూ, గుమ్మనూరు జయరాం ఏ ఆదేశాలిచ్చినా వమ్ము చేయకుండా పని చేస్తానని వైసిపి చిప్పగిరి కన్వీనర్‌గా ఎన్నికైన ఏరూరు రంగస్వామి తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ ప్రమాణ స్వీకారోత్సవం ముగిసిన అనంతరం సభలో చిప్పగిరి వైసిపి కన్వీనర్‌గా ఏరూరు రంగస్వామిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి జయరాం, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ ఏ కార్యక్రమం చేయమన్నా మండలంలో విజయవంతం చేస్తామన్నారు. అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడూ అన్యాయం జరగదన్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని రాబోయే 2024 ఎన్నికల నాటికి మండలంలో వైసిపికి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, వైసిపి ఎస్సీ మండల కన్వీనర్ నాగరాజు, గురునాథ, ధర్మేంద్ర, షేకన్న, సతీష్, బాలకృష్ణ పాల్గొన్నారు. అంతకుముందు ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ ప్రమాణ స్వీకారత్వానికి మండలం నుంచి ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు దాదాపు 100 వాహనాల్లో తరలి వెళ్లారు.

వ్యవస్థపై నమ్మకం కలిగించేలా పని చేయాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలిగించేలా అధికారులు పని చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని తెలిపారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు డివిజన్ స్థాయి వరకు రాకుండా చూసుకోవాలన్నారు. గడువులోపు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఎలో వెళ్లకుండా చూడాలన్నారు. సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియా, ఆర్‌టిసి డిఎం మహ్మద్ రఫీ, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సమస్యలను సత్వరంగా పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ... ప్రజలు సమర్పించిన అర్జీల్లో ఆధార్ కార్డు నెంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. ఆర్థిక పరమైన ఫిర్యాదులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
నంద్యాల

రైతాంగ సమస్యల పరిష్కారానికి వాణిని వినిపించండి

- ఎంపికి రైతు సంఘం వినతి

ఎంపి కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

రైతాంగం కోరుకున్న సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ లోపల వాణిని వినిపించాలని ఎంపిని రైతు సంఘం నాయకులు కోరారు. జిల్లా రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎంపి పోచా బ్రహ్మానంద రెడ్డి లేనందు వల్ల వారి కార్యాలయం నందు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ 2020 నవంబర్26 నుండి 383 రోజులు ఢిల్లీ పరిసరాలలోనూ, దేశవ్యాప్తంగాను రైతాంగం పోరాటం సాగించారని, ఆనాడు కేంద్ర ప్రభుత్వం చట్టాలను వెనక్కితీసుకుంటూ ఉద్యమం విరమిఒపమని రైతు సంఘాల నాయకులను కోరిందన్నారు. ఆ సందర్భంగానే రైతాంగం కోరుకున్న ఐదు అంశాలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని, ఏడాదినర గడిచినా ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా రద్దు చేసిన విధానాలని మళ్ళీ అమలు చేయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. తద్వారా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మళ్లీ దేశవ్యాప్తంగా మరో దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం అవుతున్నదన్నారు. ఈ పోరాటంలో ఎంపి రైతులకు మద్దతు ఇవ్వవలసిందిగా కోరుతున్నామన్నారు. రైతాంగం జరిపే ఉద్యమాల్లో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు డాక్టర్ స్వామినాథన్ సూచించిన సి 2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపు సెట్లుకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు విరమించుకోవాలని, రైతు ఉద్యమ సందర్భంగా రైతులపై పెట్టిన అన్ని కేసులు ఎత్తివేయాలని, ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, లక్కీమ్ పూర్ ఖేరి హత్యాకాండకు బాధ్యుడైన అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం చేయాలని, రైతాంగం అప్పులను రద్దు చేయాలని మొదలగు డిమాండ్స్ కొరకు ఎంపి పోచా బ్రహ్మానంద రెడ్డి మద్దతు ఇవ్వవలసిందిగా కోరుతూ వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ నాగరాజు, ఏ.ఐ.కె.ఎస్. జిల్లా నాయకులు జి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సుధాకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవనంపై దెబ్బ

- నిబంధనల పేరుతో అడ్డుకుంటున్న అధికారులు - అటవీ ఫలాలే వారికి ఆహారం

- అర్ధాకలితో అలమటిస్తున్న చెంచు గిరిజనులు - ఉపాధి చూపడంలో అధికారులు విఫలం

నల్లమల
అడవి ప్రకృతి రమణీయత పేరుగాంచింది. నల్లమల అడవిపై ఆధారపడి వందల ఏళ్లుగా చెంచు గిరిజనులు జీవిస్తున్నారు. నల్లమలలో ప్రకృతి సహజ సిద్ధంగా అనేక ఫలాలు, ఔషధ మొక్కలు లభిస్తాయి. నల్లమల అడవిలో కొండ ఈత పండ్లు, ఉసిరి కాయలు, అడవి పుట్టగొడుగులు, తేనె, మామిడితో పాటు ఇతర ఫలాలు విరివిగా లభిస్తాయి. అడవిలో నివసించే చెంచులు వాటినే తింటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నల్లమల అడవిని గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి గిరిజనులు అడవిలోకి వెళ్లకుండా అటవీ శాఖ నిబంధనలు విధించాయి. దీంతో చెంచుల జీవనంపై దెబ్బ పడింది. చెంచులు రోజు వారిగా తినేందుకు ఆహారాన్ని సేకరించుకునేందుకు కూడా అటవీ అధికారులు అడవిలోకి అనుమతి ఇవ్వకపోవడంతో అర్ధాకలితో

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రకృతి సిద్ధమైన ఫలాలకు, ఆహారాలకు, జలపాతాలు, సెలయేర్లు, నీటి ఊటలతో నల్లమల అడవి సువిశాలమైన వైశాల్యంతో కర్నూలు, మహబూబ్ నగర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలో విస్తరించి ఉంది. పురాతన కాలం నుండి చెంచులు నల్లమల అడవిపై ఆధారపడి జీవిస్తున్నారు. నల్లమల అడవిలో ఎన్నో పుణ్యక్షేత్రాలు కూడా ఉన్నాయి. నల్లమల అడవిలో 42 చెంచు గిరిజన గూడెంలు ఉన్నాయి. నారపురెడ్డి కుంట, నెమళ్లకుంట, గాజులపల్లె ఆర్ఎస్., తమ్ములపెంట, బైర్లూటీ, నల్లకాల్వ, అప్పరాజుకుంట, పెచ్చెర్వు, శివపురం ఇంకా అనేక చెంచు గూడెలంలు ఉన్నాయి. మొత్తం చెంచుగూడెంలలో దాదాపు 30 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని చెంచు గూడెంలను అడవి బయటకు తీసుకువచ్చారు. ఇంకా అనేక మంది చెంచులు అడవిలోనే జీవనం సాగిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా దొరికే పుట్టగొడుగులు, తేనే గడ్డలు, పండ్ల జాతికి చెందిన మామిడి, తునికి, కొండఈత పండ్లను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం నల్లమల అడవిని గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి గిరిజనులు అడవిలోకి వెళ్లకుండా అటవీ శాఖ నిబంధనలు విధించాయి. దీంతో చెంచు గిరిజనులు అడవిపై తమ హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటీష్ కాలం నుండి అడవిపై ఆధారపడి బతుకుతున్నామని, ప్రస్తుతం అభివృద్ధి పేరిట తమను అడవి నుండి వేరు చేయడం అన్యాయమని అడవి బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ నిబంధనల పేరుతో తమను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడవిలో అణువు అణువు తమకు తెలుసని, తమకు ఏ సీజన్లో ఏ ఆహారం దొరుకుతుందో వాటినే సేకరించి తింటామని చెబుతున్నారు. నల్లమల అడవులు వన్యప్రాణులకు, పశుపక్షాదులకు ఆవాసంగా విరాజిల్లుతుందని, చెంచు గిరిజనులమైన తాము అడవి తల్లిని ఎంతగానో ప్రేమిస్తామని చెబుతున్నారు. అడవిలో పులుట్ల, జీవి గుంతలు, ఘనమడుగులు, ఏనుగులయ్య పెంట, సందక్కసరి, గుండ్ల బ్రహ్మేశ్వరం తదితర ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని తింటూ జీవిస్తామని గిరిజనులు చెబుతున్నారు. గిరిజనులే కాక అటవీ సమీప గ్రామాల్లోని గిరిజనేతరులు కూడా నల్లమల అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అడవిలోకి వెళ్లి ఫలసాయాన్ని తీసుకునే విధంగా ప్రభుత్వం, అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని అడవి బిడ్డలు కోరుతున్నారు.

కొండ ఈత పండ్లు అమ్ముతున్న మహిళ

గిరిజనులు సేకరించిన తేనె

నల్లమల అడవే మా జీవనాధారం

పురాతన కాలం నాటి నల్లమల అడవే మా జీవనాధారం. మా తాత ముత్తాతల కాలం నుండి నల్లమల అడవిలో జీవిస్తున్నాం. అటవీ ఉత్పత్తులను సేకరించి జీవించే మేము అడవికి ఎలాంటి నష్టం చేయం. తరతరాల నుండి నల్లమల అడవిని కాపాడుకుంటూ అడవిలో దొరికే ఆహారాలను తింటూ జీవనం సాగిస్తున్నాం.

- బర్నబాస్ కోమటన్న, నారపరెడ్డి కుంట చెంచుగూడెం

అడవిలోకి వెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయం

తరతరాల నుండి నల్లమల అడవిని నమ్ముకుని ఉన్నాం. అడవిలో దొరికే ఆహారాలను సేకరించి తింటూ మా పూర్వీకుల నుండి ఇక్కడే జీవిస్తున్నాం. అటవీ ఉత్పత్తులు సేకరించకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం తీవ్ర అన్యాయం. మాకు జీవనోపాధి కల్పించలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ జీవనాన్ని అస్తవ్యస్తం చేయడం తగదు. మా జీవన విధానాన్ని దెబ్బతీసే విధంగా సంస్కరణలు ప్రవేశపెడుతున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటిడిఏ అధికారులు చేసింది ఏమీ లేదు. వారి వల్ల మా కుటుంబాల అభివృద్ధికి నోచుకోక తిరోగమనంలో పయనిస్తున్నాయి. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయిన తమ గూడెలలో విద్యుత్, సిసి రోడ్లు వేయలేదు. వెంటనే అధికారులు చెంచు గూడెంల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

- గుల్ల వీరన్న, చెంచు గిరిజన యువకుడు నారపరెడ్డి కుంట.

గాలివాన బీభత్సం

- నేలకూలీన చెట్లు,విద్యుత్ తీగలు
- పిడుగుపాటుకు బాలుడు మృతి

ధర్నా చేస్తున్న మృతిచెందిన బాలుడి బంధువులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో సోమవారం సాయంత్రం గాలి,వాన భీభత్సం సృష్టించింది. గంటపాటు వీచిన గాలి,వానకు చెట్లు,విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. భీకరమైన గాలులు వీచడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పట్టణంలోని నోబెల్ హాల్ సమీపంలో మహా వృక్షాలు సమీపంలోని వాహనాలపై కూలాయి. గ్రామ పంచాయతి కార్యాలయంలో, మహబూబ్ హాల్ వద్ద,బస్టాండ్ సమీపంలో,సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద,తదితర ప్రాంతాల్లో మహా వృక్షాలు నేల కూలాయి. వర్షంతో రహదారులపై నీరు మోకాళ్ల లోతు ప్రవహిం చింది. స్థానిక కేరళ ఆసుపత్రిలో టెంకాయ చెట్టుపై పిడుగు శబ్దం రావడంతో ఆసుపత్రిలోని రోగులు భయబ్రాంతులకు గురయ్యారు.

గడివేములు: మండల కేంద్రమైన గడివేములలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పాటు పిడుగు పడడంతో బాలుడు మృతి చెందాడు. మండల కేంద్రమైన గడివేముల గ్రామంలోని ఎరుకల పేటలో అనిరుద్ అనే బాలుడు పిడుగుపాటుకు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లికి గాయాలయ్యాయి.

అధికారుల తీరుకు నిరసనగా ధర్నా.. తమ సామాజిక వర్గం ప్రభుత్వ స్థలాల్లో గత 20 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నామని మూడు రోజుల క్రితం తహశీల్దార్ శ్రీనివాసులు ప్రభుత్వ స్థలాలను ఖాళీ చేయాలని సర్వే నిర్వహించి ఇంటి స్థలాలను ఇస్తామని ఖాళీ చేయించడంతో ఆరుబయట నివాసం ఉంటుండడంతోనే పిడుగుపాటుకు తమ బాలుడు మరణించాడని బాలుడు బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అతమకు న్యాయం చేయాలని ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ కొత్త బస్టాండ్ కూడలిలో ధర్నా నిర్వహించారు. దాదాపు రెండు గంటలు ట్రాఫిక్ కి అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

గడువులోగా నాణ్యతతో పరిష్కరించండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా సమస్యల ఫిర్యాదుల స్వీకరణలో స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఓ పుల్లయ్య, జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన కంటే మెరుగ్గా ఉండేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద నమోదైన దరఖాస్తులను 24 గంటల్లో ఓపెన్ చేసి అంగీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం మండ్లవాని పల్లెలో సోమవారం జరిగింది. బేతంచెర్ల మండల ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు..తలారి చిన్న మద్దయ్య (65) కౌలుకు భూములను తీసుకొని వ్యవసాయం చేసే వాడు. అంతేకాకుండా మామిడి పళ్ళ సీజన్లో మామిడి తోటలు కొనుగోలు చేసేవాడు. అయితే కౌలు తీసుకున్న పంటలు సరిగా రాకపోవడంతో రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. ప్రస్తుతం మామిడి పండ్ల కాపు సరిగా రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో మరింత అప్పులో కూరుకుపోయాడు. చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఆయన ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య టి.నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన చిన్న మద్దయ్య

జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా నంద్యాల జాయింట్ కలెక్టర్ నిశాంతికి సమస్యలపై వినతి పత్రం అందజేసిన నంద్యాల ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి : ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజే ఎఫ్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నిశాంతికి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు హై పవర్ కమిటీ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ప్రతి జర్నలిస్టుకు ఉచిత గృహ వసతి కల్పించాలని, జర్నలిస్టులకు పెన్షన్ విధానం, కార్మిక బీమా, పథకం అమలు చేయాలని, జర్నలిస్టుల కమిషన్, మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలని మీడియా అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల ప్రతిభను గుర్తించి అవార్డులు ప్రకటించాలని డిమాండ్ల పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసులు, అధ్యక్షుడు కాకర్ల శివ, ప్రధాన కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు జాషువా, కమిటీ సభ్యులు సుబ్బయ్య, హుసేని, హరీష్, తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** జర్నలిస్టుల డిమాండ్ డే ను పురస్కరించుకొని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ తాహసిల్దార్ హరినాథ్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు మాట్లాడారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగరాజు, టీవీఎస్వి ప్రసాద్, ప్యాపిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.మద్దయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మద్దయ్య యాదవ్ మాట్లాడారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ బనగానపల్లె నియోజక వర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహా రెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, మధు, మండల కార్యదర్శి రాజేష్, సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు, నగేష్, రమణ, సుబ్బయ్య, శ్రీకాంత్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో కియా నాలెడ్జ్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన సమక్షంలో కియా పరిశ్రమతో ఎపి ప్రభుత్వం ఒప్పందం
- ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత 'సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోర్స్' పోస్టర్ ఆవిష్కరణ
- ఐటిఐ, పాలిటెక్నిక్, నైపుణ్యాలకు ఎపిని చిరునామాగా తీర్చిదిద్దుతాం : ఆర్థిక మంత్రి

మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో జిల్లా కలెక్టర్, కియా ప్రతినిధులు

ప్రజాశక్తి-డోన్

ఆర్థిక, ప్రణాళిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 'కియా నాలెడ్జ్ ఎక్స్ లెన్స్ సెంటర్'ను లాంఛనంగా ప్రారంభించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా డోన్ పట్టణంలోని ఐటిఐ కళాశాలలో రూ.2 కోట్లతో 'ఎక్సలెన్స్ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు మంత్రి బుగ్గన వెల్లడించారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ఏర్పాటైన ఈ సెంటర్‌లో 10 కోర్సులలో వందలాది మంది యువతకు శిక్షణనందించే వీలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కియానాలెడ్జ్ ఎక్సలెన్స్ సెంటర్ భవనంలోని పైలాన్‌ను సోమవారం ఆవిష్కరించారు. కొత్తభవనంలో ఏర్పాటు చేసిన ఆటోమొబైల్, మెకానికల్, వెల్డింగ్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ ,సివిల్, సిఎస్‌సి, డైకిన్ ల్యాబ్‌లను రిబ్బన్ కట్ చేసి ఆర్థిక మంత్రి సమక్షంలో అతిథులు ప్రారంభించారు. ఏడాది గడువుతో 2 కోర్సులు, రెండేళ్ల వ్యవధితో 8 కోర్సుల్లో శిక్షణకు అనువుగా ఎక్సలెన్స్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పటికే కియా నాలెడ్జ్ ఎక్సలెన్స్ సెంటర్‌లో 484 మంది యువతీయువకులకు శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఫర్‌వొకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) అనుబంధ కోర్సులకు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డిఎంసివిల్, మెకానికల్ మోటార్ వెహికల్, మెకానిక్ డీజిల్, వెల్డర్‌రంగాల్లో యువతకు ఉపాధి, శిక్షణనందించేలా ఎక్సలెన్స్ సెంటర్ పని చేస్తుందన్నారు. ఆర్థిక, నైపుణ్య శిక్షణ శాఖ మంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన ఎపిఎస్ఎస్‌డిసి ఎండీ వినోద్, ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, కియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్ డాంగ్‌లీ వేదికపై పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. యువతకు శిక్షణ నందించే దిశగాకియా పరిశ్రమతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. శిక్షణ తీసుకునే 300 మంది యువతకి హాస్టల్ వసతికి సంబంధించి రూ.5.5 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నామని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఐటిఐ పాలిటెక్నిక్, నైపుణ్యాలకు ఎపిని చిరునామాగా మార్చే ప్రణాళికతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందని మంత్రి బుగ్గన తెలిపారు. 'స్కిల్ గ్యాప్'ను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కసరత్తు, ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు. డోన్ నియోజకవర్గంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజ్, ఐడిటిఆర్ (ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ ట్రైనింగ్ రీసెర్చ్ సంస్థ), ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్, మహిళలకు ప్రత్యేకంగా కళాశాల, హార్టికల్చర్ యూనిట్, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ (బాలురకు), పాలిటెక్నిక్ కాలేజ్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు వంటి ఎన్నో మౌలిక సదుపాయాల ఏర్పాటుతో అభివృద్ధికి సాక్ష్యంగా డోన్ నిలిచిందని మంత్రి స్పష్టం చేశారు. నైపుణ్య విద్య వల్లే వెనకబాటును అధిగమించడం సాధ్యమన్నారు. రాయలసీమ వెనకబడిన ప్రాంతం. అందుకే సీమ అభివద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నైపుణ్యం లేని విద్యనభ్యసించేవారు ఏటికేడు ఎక్కువగా ఉండడం వలనే నిరుద్యోగం పెరుగుతుందన్నారు. ఆలోచనకు, ఆచరణకు మధ్య అంతరం లేకుండా చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ధ్యేయమన్నారు. షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్ ఉన్న ఏకైక ప్రాంతం డోన్ నియోజకవర్గమని మంత్రి తెలిపారు. కియా నాలెడ్జ్ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి బుగ్గన కతజ్ఞతాభినందనలు తెలిపారు. సూక్ష్మమైన విషయాలను సైతం లోతుగా పరిశీలించి,పరిశోధించే వ్యక్తిగా ఆర్థికమంత్రి బుగ్గన ప్రత్యేకంగా నిలుస్తున్నారని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీసామూన్ తెలిపారు. ఇలాంటి యువతకు ఉపయోగపడే మరిన్ని ఎక్సలెన్స్ సెంటర్లుజిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, ఎపిఎస్ఎస్‌డిసి ఎండీ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట

- వైసిపి నాలుగేళ్ల పాలన సంబరాలు - బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి పాలన జనరంజకమని, ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని టంగుటూరు పెద్దమ్మ గుడి వద్ద నుండి బనగానపల్లె పట్టణంలోని అవుకు మెట్ట వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు. అవుకు మెట్ట వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, వైసిపి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు జిల్లెళ్ళ శివరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గరుడ దీవెనమ్మ, వైస్ ఛైర్మన్ సన్నల జనార్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** శ్రీశైలం నియోజవర్గ శాసనసభ్యుడు శిల్ప చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి కొత్త బస్టాండ్. ఎన్టీఆర్ సర్కిల్, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు కొనసాగింది. అక్కడ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ కర్నూల్ గుంటూరు రహదారి మీదుగా పార్టీ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు శివ శంకర్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్మీర్, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి కోర్టు, నాలుగు రోడ్ల కూడలి మీదుగా ఆళ్లగడ్డ పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఎస్ఐ చర్చి సమీపంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్ బాబులాల్, ఆళ్లగడ్డ పట్టణ కన్వీనర్ గొట్లురు సుధాకర్ రెడ్డి, విజయ మిల్క్ డైరెక్టర్ విజయసింహారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, దోర్నిపాడు ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, సిరివెళ్ళ ఎంపిపి వసీం, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, ఆ పార్టీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలోని బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పెద్దమ్మకాణం వీధిలోని వైయస్ఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ సోహెల్, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపీటీసీ ఫయాజ్, వైసీపీ మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం సమర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

స్మశాన కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పగిడ్యాల

స్మశాన కార్మికులకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కెవిపిఎస్ జిల్లా నాయకురాలు గంధం హుస్సేనమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పగిడ్యాల సచివాలయం-2 పరిధిలోని స్మశాన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం హుస్సేనమ్మ మాట్లాడారు. స్మశాన కార్మికుల కుటుంబ సరైన ఆర్థిక స్తోమత లేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. స్మశాన కార్మికుల ఇండ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సాగు చేసుకునేందుకు పొలాలు ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలన్నారు. స్మశాన కార్మికులకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మంజులాదేవికి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్మశాన కార్మికులు సురేష్, నల్లన్న, దేవరాజ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్ రెడ్డి తదితరులు

అటవీ శాఖ నూతన క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల అటవీ కార్యాలయం నందు జిల్లా అటవీ శాఖ వినీత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆధునీకరించిన నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ మధుసూదన్ రెడ్డి, వై. శ్రీనివాసరెడ్డి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎఫ్‌డిపి టిటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిఓ, శివన్న, డిఆర్‌ఓ, జాకీర్ హుస్సేన్, ఎఫ్ఎస్ఓలు జాకీర్ హుస్సేన్, విజయ లక్ష్మి, ఎఫ్‌బిఓలు పరమేశ్వర్, శ్రీనివాసులు, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మేజర్ పంచాయతీలోని పలు కాలనీలలో కొత్త వీధిలైట్లు సోమవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ బైరెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ వైసిపి నాయకుడు బైర్రెడ్డి రాజశేఖర్ పర్యవేక్షణలో ఎస్‌సి కాలనీ, బ్రహ్మయ్య రైస్ మిల్లు మెయిన్ రోడ్డు, పడమటి వీధి, బెస్త కాలనీ, కస్తూర్బా గురుకుల పాఠశాల రోడ్డు, అలాగే మరికొన్ని వీధుల్లో కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కాలనీలలో వీధిలైట్ల సమస్య ఉండడంతో కాలనీవాసులు సమస్యను పరిష్కరించాలని కోరడంతో కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సర్పంచ్ పేర్కొన్నారు. కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు : ఎమ్మెల్యే

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

సంక్షేమ వారధులు గ్రామ, వార్డు వాలంటీర్లు అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం లోని పొదుపు భవనంలో ఎంపీడీవో శివరామయ్య అధ్యక్షతన వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డులు పొందిన వాలంటీర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు సన్మానించి, నగదు పారితోషికం, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను అందుబా టులోనికి తెచ్చారని తెలిపారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజలకు వారధి పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే వారధులు వాలంటీర్లేనని వారి సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, వైసీపీ యువజన విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, ఎంపీపీ మానసవీణ, ఉప మండల అధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, జడ్పిటిసి సభ్యురాలు సుబ్బ లక్షమ్మ పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నల జనార్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన పేదలందరికీ అందించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వాలంటీర్లకు సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా ఉన్న వాలంటీర్లను ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ,వార్డు వాలేంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ టౌన్ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి, సింగం వెంకటేశ్వర రెడ్డి, శివనాగిరెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి, బద్రి భాస్కర్ రెడ్డి, సింగం నాని, కాంట్రాక్టర్ నజీర్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామ వాలంటీర్ల సేవలు అభినందనీయం అని సోముల సుధా కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా అన్నారు. సోమవారం మండలంలోని ముసలమడుగు గ్రామంలో ఉన్న సచివాలయంలో గ్రామ సర్పంచ్ జమీలాబీ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఎంపికైన వాలంటీర్లను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంపీటీసీ ముబీనా బేగం, ఉప సర్పంచ్ బంగి నాగన్న, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిన్నారికి అన్నం వడ్డీస్తున్న జాయింట్ కలెక్టర్

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జెసి నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ సూచన మేరకు ప్రతి సోమవారము స్పందన అర్జీదారులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ సోమవారం ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సుధాకర్, జిఎం బిఇడి కళాశాల అమీరుద్దీన్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ప్రారంభించి అర్జీదారులకు ఆహారం పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రతి వారం స్పందన అర్జీ దారులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. అనేక మంది సుదూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీ దారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ అన్నదానం కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జల శాఖా జిల్లా అధికారి రఘురాం, జిల్లా పరిశ్రమల శాఖా జిల్లా అధికారి శ్రీనివాస్ యాదవ్, జడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఎఫ్ఓ రాజునాయక్, ప్యాట్రన్ చేతన్ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

భూ యజమానితో సంబంధం లేకుండా అర్హులైన కౌలు రైతులందరికీ ప్రభుత్వం కౌలు కార్డులు పంపిణీ చేయాలని కౌలు రైతుల జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్, మండల కార్యదర్శి మార్కు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేయాలని, భూ యజమాని సంతకాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మాజీ ఉప సర్పంచ్ సతీమణి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పాత రైస్ మిల్ వెనక నివాసం ఉంటున్న మాజీ ఉప సర్పంచ్ సజ్జాద్ భార్య నూర్జహాన్ (57) మృతి ఆదివారం రాత్రి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న పట్టణ మాజీ సర్పంచ్ బి.సి. రాజారెడ్డి సజ్జాద్ ఇంటికి వెళ్లి నూర్జహాన్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కుటుంబం సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ తాను పట్టణ సర్పంచ్ గా పనిచేసే సమయంలో సజ్జాద్ ఉప సర్పంచ్‌గా పనిచేశారని, అప్పటి నుండి ఆ కుటుంబంతో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయన్నారు. నూర్జహాన్ అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని బిసి రాజారెడ్డి సూచించారు.

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్ళను దర్శించుకునేం దుకు ఆది, సోమ వారాలలో భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రంలో ఎండలు తగ్గి చల్లబడడంతో పాటు విద్యార్థులకు సెలవు దినాలు ముగిస్తుండోడమే కాకుండా పరీక్షలు రాసిన కొన్ని ఫలితాలు వెల్లడి కావడంతో స్వామి అమ్మ వాళ్ళని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండి కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుండి స్వామి అమ్మలను దర్శించుకునేందుకు ఉచిత శీఘ్ర అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి స్వామి మూలం దర్శించుకుంటున్నారు. స్వామీ అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులకు తెలిపారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

ఎంపిటిసి అత్త మృతి పట్ల సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రికి చెందిన మండల వైయస్సార్ కాంగ్రెస్ నాయకుడు ఎల్లంపల్లి కిరణ్ తల్లి, ఎంపీటీసీ వై వెంకటలక్ష్మి అత్త ఎల్లంపల్లి సుభద్రమ్మ (75) మతి పట్ల వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ సోహెల్ సంతాపం తెలిపారు. సోమవారం ఆమె చనిపోయిన విషయం తెలిసిన వెంటనే మృతుల ఇంటికి చేరుకొని భౌతిక కాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని భవానీ నగర్‌కు వివాహిత షేక్ అచ్చుకట్ల బీబీ(38) క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన బీబీ తన భర్త ఫకృద్దీన్ తాగుడుకు బానిస కావడంతో వారం రోజుల నుండి ఇద్దరు గొడవపడే వారు. దీంతో బీబీ మనస్థాపానికి గురై తమ గృహంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పనట్లు ఎస్ఐ వివరించారు. గమనించిన స్థానికులు కేరళ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు సంతానం కలరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి నివాసంలో అవుకు మండలం మంగంపేట గ్రామానికి చెందిన యువకులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బీసీ ఇందిరా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి నివాసంలో మంగంపేట గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో యువకులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో రాణించి నియోజకవర్గానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

ఉర్దూ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సి ఉర్దూ మీడియం చదివిన విద్యార్థులు అర్హూలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఇంగ్లీష్ మీడియంలోనూ అడ్మిషన్లు కలవని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఉర్దూ జూని యర్ కళాశాలలో గాని, 9441579305 ఫోన్ నెంబర్ ద్వారా కానీ సంప్రదించాలని తెలిపారు.

ఢిల్లీలో రెజ్లర్లపై దాడి దారుణం

- రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బిజెపి ఎంపీ దుర్మార్గాలను నిరసిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేపట్టిన రెజ్లర్లను, నిరసనకారులను అరెస్టు చేయడం దారుణ మని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని, రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై నిర్బంధ కాండ విధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

డ్రోన్ పైలెట్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో బేతంచర్ల పట్టణంలోని శేషారెడ్డి ప్రాంగణంలో ఏ.పీ.ఎస్.ఎస్.డి.సి సహకారంతో ఏర్పాటు చేసిన డ్రోన్ పైలెట్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైట్ సీ.ఈ.వో సుశీల్ కుమార్, డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ టీచర్ దస్తగిరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులై ఉద్యోగం కోసం ఎదురుచూసే నిరుద్యోగ యువతీ యువకులకు 60 రోజులపాటు శిక్షణను ఉచితంగా ఇచ్చి వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యా అర్హత పత్రాలతో శేషారెడ్డి పాఠశాలలో ఉన్న డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ సెంటర్లో సంప్రదిం చాలని, మరిన్ని వివరాలకు 9603437726, 7799009799 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేడు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం మంగళవారం నాడు స్థానిక అన్న క్యాంటీన్ నందు నిర్వహిస్తున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సమావేశంలో ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన 18 అజెండాలను పొందపరచామని వాటిపై కౌన్సిలర్లు చర్చించి నిర్ణయం తీసుకుంటారని ఆయన తెలిపారు. సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన సందర్భంగా కోరారు.

ఏం అభివృద్ధి చేశారని సంబరాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే సంబరాలు చేస్తున్నారని తాలుకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి విమర్శిం చారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చాగలమర్రి, సిరివెళ్ల మండల కేంద్రాలలో వర్షం వస్తే డ్రైనేజ్ పరిస్థితి ఎట్లా ఉందో మీరే చూడాలన్నారు. ఎర్రగుడిదిన్నెలో ప్యాలెస్, ఆళ్లగడ్డలో ప్యాలెస్ కట్టుకోవడమేనా అభివృద్ధి అని అన్నారు. ఆళ్లగడ్డలో గత నాలుగేళ్లలో ఏమి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

సిద్దేశ్వరం జల జాగరణ దీక్షను జయప్రదం చేయండి

- సామాజిక రాయలసీమ మహాసభ

ప్రజాశక్తి - పాములపాడు

ఈనెల 31న జరిగే సిద్దేశ్వరం జల జాగరణ దీక్షలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని సామాజిక రాయలసీమ మహాసభ కన్వీనర్ డాక్టర్ డి.నాగన్న, బిసి ఐక్య సంఘం అధ్యక్షుడు గట్టు. శంకర్ గౌడ్, సేవా భారతి అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలీ, రజక సంఘం మండల అధ్యక్షుడు వి.రామకృష్ణుడు, మాజీ అధ్యక్షుడు సి.ధర్మయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు యస్. సుకూర్ బాష, ముర్తుజావలి, వివిధ ప్రజా సంఘాల నాయకులు సునీల్, జనార్ధన్ రావు, సుబ్బయ్య, మైమాకర్, షఫీవుల్లా తదితర నాయకులు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగన్న మాట్లాడుతూ సిద్దేశ్వరం దగ్గర జరిగే జల జాగరణ దీక్ష రాయలసీమ సాగునీటి సాధన సమితి, రాయలసీమ ప్రజాసంఘాల సమన్వయ వేదిక సభ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మద్దతుగా సామాజిక రాయలసీమ మహాసభ మద్దతుగా పాల్గొంటుందన్నారు. జల జాగరణ దీక్షలు 31 న సాయంత్రం 6 గంటల నుండి జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మిస్తే రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు కొరత ఉండదని రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని అన్నారు. అలుగు సాధనకై ప్రజా ప్రతినిధులు, మేధావులు, సామాజికవేత్తలు, కవులు, కళాకారులు, రైతులు వివిధ యువజన, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు రాజకీయాలకతీతంగా రాయలసీమ అభివృద్ధి కోసం కలిసి రావాలని కోరారు.

పాములపాడు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూర్: రాయలసీమకు సాగు, తాగునీరు సాధించటం కోసం ఈ నెల 31వ తేదీ నుండి జూన్1 వరకు రెండురోజులపాటు చేపడుతున్న జలదీక్షను జయప్రదం చేయాలని సామాజిక రాయలసీమ మహాసభ అధ్యక్షులు డాక్టర్ నాగన్న కోరారు. జలదీక్షకు సంబంధించిన పోస్టర్లను సోమవారం డాక్టర్ నాగన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

గరీబ్ నగర్‌లో సిమెంట్ రోడ్డుకు మోక్షమెప్పుడు ? : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని గరీబ్ నగర్‌లో మదీనా మసీదు నుంచి కోర్టు రోడ్డు వరకు సిమెంట్ రోడ్డుకు మోక్షం ఎన్నడు వస్తుందోనని కాలనీ ప్రజల కష్టాలు ఎప్పుడూ తీరుతాయోనని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు ఏ. సురేంద్ర, జి. నాగేశ్వరావు, డి. రామ్ నాయక్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని గరీబ్ నగర్‌లో సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001లో సిపిఎం పార్టీ అభ్యర్థి వార్డుమెంబర్‌గా గెలిచిన సందర్భంగా ఆ ఏరియాలో 2002లో రూ.18 లక్షలతో మెయిన్ రోడ్డు వేయించడం జరిగిందన్నారు. అప్పుడు గరీబ్ నగర్ మొత్తం ఒకటే వార్డు కింద ఉండేదని, ఇప్పుడు గరీబ్ నగర్ 19వ వార్డు, 16వ వార్డు కలయికగా ఉందని అన్నారు. గతంలో వేసిన సిమెంట్ రోడ్డు దాదాపు 21 సంవత్సరాలు కావస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు రోడ్డును పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పుడు ప్రస్తుతం పట్టణంలో సిమెంట్ రోడ్ల మీదనే రోడ్లు వేస్తున్నారు కానీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న ఏరియాలలో సిమెంట్ రోడ్లు వేయడం లేదని అన్నారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో వైయస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి వెంటనే సిమెంట్ రోడ్డు వేస్తామని నమ్మబలికిన నాయకులు ఎన్నికలు అయిపోయి సంవత్సరము కావస్తున్న రోడ్డుకు ఇంకా మోక్షం రాలేదని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షానికి చేపలు అంత చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. ఈ రోడ్ పైన కోర్టుకు, హాస్పిటల్‌కు ప్రతి రోజు వందలాది మంది నడుస్తుంటారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గరీబ్ నగర్‌లోని మదీనా మసీదు నుంచి కోర్టు రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు వేయాలని కోరారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందర ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు కిరణ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం

టిడిపి పాలనలోనే మహిళల అభివృద్ధి : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె

తెలుగుదేశం పార్టీ పాలనలోనే మహిళల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మినీ మేనిఫెస్టోలో మహిళలకు వరాలు కురిపించడంతో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా మాట్లాడుతూ మేనిఫెస్టోలో మహిళల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను పొందుపరిచిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పక్కూర్ బి, మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రమణమూర్తికి 'తాటిమాను' పురస్కారం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో లలిత కవి కీర్తిశేషులు తాటిమాను నారాయణరెడ్డి 9వ స్మారక సాహితీ పురస్కారాన్ని చిన్నయ సూరి సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ వైష్ణవ వేంకట రమణమూర్తికి అందజేశారు. సోమవారం సూరన సార్వస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు అధ్యక్షతన నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, తాటిమాను నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు మురళీధర్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు రమణమూర్తిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కవి రమణమూర్తి జీవితం నేటి కవులు రచయితలకు ఆదర్శమని కొనియాడారు. రచయిత్రిగా ప్రధానిచే ప్రశంసలందుకున్న కోవెలకుంట్లకు చెందిన విజయదుర్గను చిన్నయ సూరి సాహితీ సమితి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు, రచయితలు కొప్పుల ప్రసాద్, నీలం వెంకటేశ్వర్లు, శేషఫణి, మహబూబ్ బాషా, నరేంద్ర, ,మద్దిలేటి, మధుసూదన్, వెంకటేశ్వర్లు, సాహిత్య అభిమానులు, కవులు పాల్గొన్నారు.

రమణ మూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

మూఢనమ్మకాల నమ్మొద్దు

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులు హేతుబద్ధంగా ఆలోచించాలని, గుడ్డిగా ఏది నమ్మకూడదని, మూఢనమ్మకాలము అస్సలు నమ్మవద్దని గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మద్దమ్మ మాట్లాడారు. గుడికి వెళితే దేవుడు అనుగ్రహాన్ని ఇస్తాడో లేదో కానీ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానం తప్పకుండా వస్తుందన్నారు. అందుకే గ్రంథాలయాలని విజ్ఞాన భాండాగారాలు అని పెద్దలు అన్నారని అన్నారు. విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుపై పూర్తిగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు బిస్కెట్లు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ అధికారి మద్దమ్మ

వేసవి శిక్షణ తరగతులు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

మహానంది : వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ప్రముఖ రచయిత, జాతీయ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, సీనియర్ పాత్రికేయులు గద్వాల రామకృష్ణుడు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం రవి రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు గద్వాల రామకృష్ణుడు మాట్లాడుతూ వేసవి సెలవులను వృధా చేసుకోకుండా ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-డోన్

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉత్సాహానికి ఎంతో దోహదపడతా యని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని శుభం విల్లా హోమ్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్స్ రెగటి అర్జున్ రెడ్డి,కొంగటి ప్రశాంత్ వారి ఆర్థిక సౌజన్యంతో పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి కర్నూల్ జిల్లా పురుషుల డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం అర్ధరాత్రి ముగిసాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోరాహోరీగా సాగిన మూడు సెట్ల క్యాటగిరీల ఆటలో ఓపెన్ క్యాటగిరి లో మొదటి స్థానం కర్నూల్‌కి చెందిన విజయ్ రాజ్,ఇమాన్యల్ జట్టు కైవసం చేసుకున్నారని వారికి రూ.25 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. రెండవ స్థానంలో నంద్యాలకి చెందిన సాయి, కౌశిక్ జట్టు కైవసం చేసుకున్నారని వారికి రూ.12500 నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన వారికి నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. 30 ప్లస్ క్యాటగిరిలో మొదటి స్థానం కర్నూల్‌కి చెందిన బాషా,ఇమానియల్ జట్టు, రెండవ స్థానంలో డోన్‌కి చెందిన ప్రేమ్,ఎల్లాధర్ జట్లు నిలిచాయన్నారు. మూడవ స్థానంలో నంద్యాలకు చెందిన ప్రసాద్,పవన్ జట్టు, నాల్గవ స్థానంలో డోన్‌కి చెందిన శబరీష్ ,రషీద్ జట్టు కైవసం చేసుకున్నారని వారికి నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. 40 ప్లస్ క్యాటగిరిలో మొదటి స్థానంలో కర్నూల్‌కి చెందిన సతీష్,బాషా జట్టు నిలవగా, రెండవ స్థానంలో డోన్‌కి చెందిన చైతన్యరాజ్,సుమన్ జట్టు, మూడవ స్థానంలో ఎమ్మిగనూరుకు చెందిన రామకృష్ణ,జగదీష్ జట్టు, నాల్గవ స్థానంలో బేతంచర్లకు చెందిన జాకీర్,మహేష్ జట్టు నిలిచాయని వారికి నగదు, ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు అనార్,వెంకటారామ్,జహీర్,కరుణాకర్,సురేష్, చంద్రశేఖర్, జానకిరామ్,సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీలను అందజేస్తున్న శుభం విల్లా హోమ్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్స్ రెగటి అర్జున్ రెడ్డి,కొంగటి ప్రశాంత్